క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా జంగయ్య



జంగయ్యకు నియామక పత్రం అందజేస్తున్న ఇటుక రాజు మాదిగ

షాద్‌నగర్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చటాన్‌పల్లి గ్రామానికి చెందిన సింగపాగ జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో గురువారం రాత్రి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగపాగ జంగయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

పండ్లకు డిమాండ్

పెరిగిన ధరలు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షాపులో పండ్లు కొంటున్న ప్రజలు

మొయినాబాద్: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పండ్లకు డిమాండ్ పెరిగింది. మొయినాబాద్‌లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా పండ్ల షాపులు ఏర్పాటు చేశారు. ఉపవాసం చేసిన భక్తులు దీక్ష విరమించి పండ్లు మాత్రమే తింటారు. దీంతో పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. అరటి పండ్లు డజన్ రూ. 70 నుంచి80, ద్రాక్షా కిలో రూ.100, నలుపు ద్రాక్షా కిలో రూ.150, తర్బూజా కిలో రూ.100, ఆపిల్స్ రూ.100కు రెండు, వాటర్ మిలన్ రూ.100 నుంచి 150, ఆరేంజ్ రూ.100కు మూడు, దానిమ్మ రూ.100కు రెండు విక్రయిస్తున్నారు. గతేడాదికంటే ఈసారి పండ్ల ధరలు ఎక్కువగానే పెరిగాయని కొనుగోలు దారులు పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

పట్టణ సీఐ ప్రతాప్‌లింగం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్: భక్తుల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్న జాతరలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శుక్రవారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. భక్తుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి దర్గా వెంకటేశ్, ఆవ జగన్, మహిపాల్‌రెడ్డి, సూర్య, కార్తీక్, శ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్ రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలలో చేరేందుకు ఆదివారం రెండో లెవల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల మహిళా, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10గంటలనుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

నేత్రదానం



చేవెళ్ల: మండలంలోని ఇక్కారెడ్డి గూడలో శుక్రవారం ఉదయం గణపతి క్రిష్టారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు ఎల్వీ ప్రసాద్‌కంటి ఆసుపత్రికి దానం చేశారు. 2015లో గ్రామస్తులంతా కలిసి నేత్రాలను దానం చేస్తామని అంగీకార పత్రాలను ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు మాట ప్రకారం కుటుంబ సభ్యులు చనిపోయిన వ్యక్తుల నేత్రాలను దానం చేస్తున్నారు. గణపతి క్రిష్టారెడ్డితో 16వ నేత్రదానంగా పేర్కొన్నారు.



కొత్తూరు: కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మొయినాబాద్ శివాలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



చేవెళ్ల: స్వామివారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు



షాద్‌నగర్: శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



షాబాద్: తాళ్లపల్లిలో కొలువైన శివలింగం



కొందుర్గు: రావిర్యాల సోమలింగేశ్వరస్వామి దేవాలయంలో

హరహర మహాదేవ.. శంభోశంకరా

మహాశివరాత్రి సందర్భంగా మున్సిపాలిటీలతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాలు, గ్రామాల్లో శుక్రవారం శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పూజలు చేశారు. శివాలయాల్లో హరహర మహాదేవ.. శంభోశంకరా నామ స్మరణ మారుమ్రోగింది. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో శివపూజలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కొత్తూరు మున్సిపాలిటీలోని శివాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్‌లో ఉత్తర రామలింగేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేపీ నేత శాంతికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్యలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



షాద్‌నగర్: శివలింగానికి పూజలు చేస్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



శంకర్‌పల్లి: మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



మొయినాబాద్ రూరల్: మల్లికార్జున భ్రమరాంభికల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



చేవెళ్ల: కొనగట్టు శివాలయంలో అభిషేకం చేస్తున్న చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి

హరిత వనాలు.. ఎండిన మొక్కలు!



వెంకటాపూర్ నర్సరీలో ఎండిన మొక్కలు

- రూ. లక్షల్లో ఖర్చు
- సిబ్బంది పర్యవేక్షణ కరువు
- నెరవేరని లక్ష్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మొయినాబాద్: గ్రామాలను హరిత వనాలుగా మార్చాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో వన నర్సరీలను ఏర్పాటు చేసింది. దీని కోసం రూ. లక్షల్లో ఖర్చుచేశారు. లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేదు. వీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోవడమే కాకుండా వాటి పెంపకం కూడా తగ్గిపోయింది. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మొక్కలు పెంచుతున్నా వాటికి నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయాయి. 2015 నుంచి హరితహారం పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జులై, ఆగస్టులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుంది. అందుకోసం అవసరమైన మొక్కలను గ్రామాల్లోనే పెంచాలని ప్రతి ఊళ్లో వన నర్సరీలు ఏర్పాటు చేయించారు. నర్సరీలకు స్థలాలు కేటాయించి మొక్కలు పెంచేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు విడుదల చేశారు. ప్రతి యేడు వన నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకానికి రూ. లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. ఐనప్పటికీ వాటి లక్ష్యం నెరవేరడంలేదు.

మొక్కలు అరకొరే...

నర్సరీల్లో పెంచిన మొక్కలను గ్రామాల్లో నాటితే నిర్వహణలోపంతో అవి పెరిగి పెద్దగయ్యేవి మాత్రం అరకొరగానే ఉన్నాయి. మొక్కల పెంపకానికి, నీళ్లు పోయడానికి రూ. లక్షలు ఖర్చుచేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. నాటిన మొక్కలు పెగడంలేదు. గతేడాది మొయినాబాద్ వన నర్సరీలో పెంచిన మొక్కలను ఎక్కడా నాటకుండా నర్సరీలోనే ఉంచారు. వాటికి సరైన సమయంలో నీళ్లు పోయకుండా ఎండబెట్టారు. ఈ ఏడాది సైతం మళ్లీ మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టారు. వెంకటాపూర్ వన నర్సరీలో పెంచే మొక్కలకు సక్రమంగా నీళ్లు పోయక అవికూడా ఎండిపోతున్నాయి. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉండటంతో చాలా నర్సరీల్లో మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. రికార్డుల్లో మాత్రం వేల సంఖ్యలో మొక్కలు పెంచుతున్నట్లు, అందుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తునట్లు లెక్కలు మాత్రం చూపుతున్నారు. వన నర్సరీల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వన నర్సరీలపై అధికారులు దృష్టి సారిస్తారో లేదో వేచి చూడాల్సిందే!

నేడు సాయిరెడ్డిగూడలో మల్లన్న కల్యాణం

షాబాద్: లింగారెడ్డిగూడ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సాయిరెడ్డిగూడలో శనివారం మల్లన్న కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. ఉదయం 12 గంటలకు బోనాల ఊరేగింపు, మధ్యాహ్నం మల్లన్న కల్యాణం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ సులోచన శేఖర్‌రెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సీఎం రేవంత్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానిస్తున్న వెంకట్‌రెడ్డి

షాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు హైతాబాద్ ఎంపీటీసీ పొన్న జయమ్మ వెంకట్‌రెడ్డి తెలిపారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానిచారు. ఈ సందర్భంగా సీఎం రేంవత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

సీఐ కాంతరెడ్డికి సన్మానం

షాబాద్: షాబాద్ సీఐగా బాధ్యతలు తీసుకున్న కాంతరెడ్డిని హైతాబాద్ ఎంపీటీసీ పొన్న జయమ్మ వెంకట్‌రెడ్డి, వడ్ల సత్యనారాయణచారి, అత్తిలి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజుగౌడ్, దోనూరు శంకరయ్య, భాస్కరచారి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



సీఐ కాంతరెడ్డిని సన్మానిస్తున్న హైతాబాద్ ఎంపీటీసీ పొన్న జయమ్మ వెంకట్‌రెడ్డి

సీఎం సోదరుడికి పరామర్శ

షాద్‌నగర్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆసుపత్రిలో తిరుపతిరెడ్డిని పరామర్శించారు.



సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బహుజన రాజ్యమే లక్ష్యం

బీఎస్పీ ఎన్నికల నిర్వహణ ఇన్‌చార్జి విజయ ఆర్య క్షత్రియ

షాబాద్: బహుజన రాజ్య నిర్మాణమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీఎస్పీ ఎన్నికల నిర్వహణ ఇన్‌చార్జి విజయ ఆర్య క్షత్రియ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పనిచేయాలని పిలుపునిచ్చారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం విస్తృతం చేయాలన్నారు.

చేవెళ్ల ఉపాధ్యక్షుడిగా మల్లీ వెంకటేశ్ నియామకం

బీఎస్పీ చేవెళ్ల ఉపాధ్యక్షుడిగా నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లీ వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విజయ ఆర్య క్షత్రియ తెలిపారు. అసెంబ్లీ ఇన్‌చార్జి రాజమహేంద్రవర్మ, జిల్లా ఇన్‌చార్జి జామ చంద్రన్, అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు చందు, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశ్

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌లో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా పోతుగల్ గ్రామానికి చెందిన పామెన నర్సింహులు, కేసారం గ్రామానికి చెందిన మంగలి చెన్నయ్యలను ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు.



నర్సింహులు



చెన్నయ్య

బీఆర్ఎస్ అవినీతి పాలనకు బీజేపీ అండగా నిలించిది: పామెన భీంభరత్

బీఆర్ఎస్ అవినీతి పాలనకు కేంద్రంలోని బీజేపీ అండగా నిలించిదని చేవెళ్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోంట వెంకటయ్య తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కతాను ముక్కలేనని, ఢిల్లీలో దోస్తీ గల్లీల్లో లొల్లి చేస్తూ నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పాలన కొనసాగిస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, రవీందర్, పామెన నర్సింహులు, చెన్నయ్య, కుమార్, రాహుల్‌గుప్తా, గడ్డం చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



వెంకటయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పామెన భీంభరత్

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో, స్వచ్ఛందసంస్థలు, మహిళాసంఘాలు శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు, రాజకీయనేతలు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్ తరం మహిళలదేనని కొనియాడారు.



షాద్‌నగర్ రూరల్: మహిళా కార్మికులను సన్మానించిన నాయకులు



షాద్‌నగర్ రూరల్: కాకతీయ పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు



కొత్తూరు: నాని మహిళా కౌన్సెలింగ్ కేంద్రం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్